క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



పిఠాపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో అంకురార్పణ నిర్వహిస్తున్న వేద పండితులు

పిఠాపురం: పిఠాపురంలో వేంచేసియున్న పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



నాగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణా సమేత నాగేశ్వర స్వామి దివ్య వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ వేద పండితులు ఆకొండి వేంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆకొండి ప్రభాకర శాస్త్రి స్వామి వారి దివ్య వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం నాగేశ్వర స్వామికి ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం లక్ష బిల్వార్చన రుద్ర హోమం నిర్వహించారు. అపర్ణాదేవికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారి దివ్య కల్యాణోత్సవాలను తిలకించారు.

ఆకట్టుకున్న అన్నదాత నాటిక ప్రదర్శన



అన్నదాత నాటికలోని ఒక సన్నివేశం

పిఠాపురం: అపర్ణా సమేత నాగేశ్వర స్వామి దివ్య వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా అపర్ణా నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ రాష్ట్రాల నాటక పోటీలు ప్రేక్షకాదరణ పొందుతున్నాయి. రెండవ రోజు శనివారం రాత్రి కళాంజలి హైదరాబాద్ కళాకారులతో ప్రదర్శించిన అన్నదాత నాటిక ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. అందరికీ అన్నం పెట్టే అన్నదాత పడే వేదనను కళాకారులు కళ్లకు కట్టినట్టు ఆవిష్కరించారు. సమాజానికి రైతు ఎంత ముఖ్యమో వివరించారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

సామర్లకోట: పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మామిడాల కాసులను ఎన్నుకున్నారు. ఆదివారం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ఆధ్వర్యంలో పెద్దాపురం, పిఠాపురం, వేట్లపాలెం, కాకినాడు, ఉండూరు, అచ్చంపేట, రైల్వే స్టాండులకు చెందిన యూనియన్ ప్రతినిధులు పట్టణ యూనియన్ అధ్యక్షుడు, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ న్యాయ సలహాదారుడిగా చిక్కం ఈశ్వరుడిని ఎంపిక చేసుకున్నారు.

పేద దేవాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి



తీర్మానాలను ప్రకటిస్తున్న అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పెద్దాపురం: అమరావతి రాజధానిలో ప్రభుత్వ సహకారంతో దేవాంగ భవన నిర్మాణం చేపట్టి, పేద దేవాంగులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని దేవాంగ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. పెద్దాపురం ముప్పన రామారావు చేనేత కల్యాణ మండపంలో ఆదివారం ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షతన దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల్లో చేనేత సమస్యలు, కష్టాలపై చర్చించిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వరరావు, బండారు ఆనంద ప్రసాద్, మచ్చా నిరంజన్, దేవాంగ సోదరులు, సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా కోట్లమ్మ చెరువు అభివృద్ధి పనులు

- చెరువు సుందరీకరణపై దృష్టి సారించని పాలకులు
- వాకింగ్ ట్రాక్‌లో దట్టంగా పెరిగిన తుప్పలు
- ఫలించని 9 వార్డుల ప్రజల ఎదురుచూపు



కోట్లమ్మ చెరువులో దట్టంగా పెరిగిన గడ్డి

సామర్లకోట: స్థానిక కోట్లమ్మ చెరువు అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధుల ప్రయత్నాలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. 20 ఏళ్లుగా చెరువును అభివృద్ధి చేస్తామని ఆ ప్రాంత ప్రజలకు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు హామీలిచ్చి అనంతరం విస్మరించారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి పనులు ప్రారంభం

వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి మున్సిపాలిటీలో చెరువును అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అమృతధార పథకంలో నిధులు మంజూరు చేసి కోట్లమ్మ చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా చెరువు చుట్టూ రక్షణగా గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పార్కును సిద్ధం చేసి చెరువులో పూడికను తొలగించారు. పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికలు రావడం, అనంతరం ఈ చెరువు అభివృద్ధి పనులకు బ్రేక్ పడటంతో ఆయా వార్డుల ప్రజల ఎన్నో ఏళ్ల కోరిక నెరవేరలేదు. డిప్యూటీ సీఎంగా రాజప్ప చెరువును పరిశీలించారు. ప్రస్తుతం ఆయనే ఎమ్మెల్యేగా ఉండటంతో చెరువు పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో నీరు భలే రుచి

కోట్లమ్మ చెరువు ఎర్ర నేలతో ఉండటంతో చెరువులోని నీరు ఎంతో రుచికరంగా ఉండటంతో ఒకటి నుంచి 9 వార్డుల వరకు చెందిన ప్రజలు తాగునీరుగా ఉపయోగించే వారు. ఈ చెరువును నింపడానికి గోదావరి కాలువ నుంచి గతంలో పైపు



వాకింగ్ ట్రాక్‌పై పెరిగిన తుప్పలు



శిథిలమైన వాకింగ్ ట్రాక్ రైలింగ్

లైన్ ఉండేది. స్క్రాప్ పవర్ ప్లాంటు పనులతో పైపులైన్ ధ్వంసమైంది. అప్పటి నుంచి చెరువులో నీరు లేక పోవడంతో నిరుపయోగంగా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లమ్మ చెరువు అభివృద్ధికి శ్రీకారం చుడితే ఆ పనులు మధ్యలో నిలిచిపోయాయి. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ రైలింగ్ ధ్వంసమైంది. వాకింగ్ ట్రాక్‌పై తుప్పలు పెరిగిపోయాయి. చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన పార్కులో మొక్కలు పూర్తిగా చనిపోయాయి. దాంతో చెరువును అనేక మంది బహిరంగ మరుగుదొడ్డిగా వినియోగిస్తున్నారు. చెరువుకు ఏర్పాటు చేసిన గేటు తీసి ఉండటంతో ఆకతాయిలు ఈ చెరువు గట్టులోకి ప్రవేశించి రాత్రి సమయం మద్యం సేవిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేసి చెరువు చుట్టూ ఫల సహాయాన్ని ఇచ్చే మొక్కలు పెంచి, చెరువులో పెరిగిన గడ్డిని తొలగించి, నీటితో నింపి వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

నడక వ్యాయామానికి అవకాశం లేదు



కోట్లమ్మ చెరువు చుట్టూ ఉన్న 1 నుంచి 9 వార్డులకు చెందిన ప్రజలు చెరువులో నీటిని తాగేందుకు ఉపయోగించే వారు. గత ప్రభుత్వంలో చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ప్రస్తుతం వాకింగ్ ట్రాక్ తుప్పలతో నిండిపోయింది. వాటర్ ట్యాంకుల వెనుక భాగంలో వాకింగ్ ట్రాక్ రైలింగ్ పూర్తిగా శిథిలమైంది. రాత్రి సమయంలో చెరువు గట్టుపై మందు బాబుల వీరవిహారం పెరిగింది.

– పాలిక చంటిబాబు, ఆర్‌ఎంపీ డాక్టరు, సామర్లకోట

కోట్లమ్మ చెరువు అభివృద్ధికి కృషి



చెరువు అభివృద్ధిపై అనేక మంది ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాం. చెరువు చుట్టూ పేద ప్రజలు నివాసం ఉంటున్న వార్డులున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమృత ధార నిధులతో మున్సిపల్ చెరువు అభివృద్ధిలో భాగంగా కోట్లమ్మ చెరువును సూచించాం. ఎన్నికలు తరువాత అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోయాయి. అమృతధార నిధులు ఇంకా ఉన్నాయని తెలిసింది.అవి చాలకుంటే మున్సిపల్ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం.

– ఊబా జాన్‌మోజెస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, సామర్లకోట

మరిడమ్మ సన్నిధిలో జడ్జి హర్షవర్ధన్ పూజలు



మరిడమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జి హర్షవర్ధన్ దంపతులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి హర్షవర్ధన్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, సిబ్బంది వెంకటరమణ ఆధ్వర్యంలో జడ్జి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయంలో ప్రతి వారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు పదో తరగతి విద్యార్థుల కోసం ప్రార్థనలు

సామర్లకోట: పదో తరగతి పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్న మండల పరిధిలోని విద్యార్థుల కోసం సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక సీబీఎం హైస్కూల్ ఆవరణలో మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని సంఘ అధ్యక్షుడు డాక్టరు టి బ్లెసింగ్ తెలిపారు. ప్రార్థనల అనంతరం ప్రతి విద్యార్థికి ప్యాడ్, పెన్ను, స్కేలు, రబ్బరు, పెన్సిల్ అందజేస్తామని కార్యదర్శి కె జయబాబు, కోశాధికారి వై కరుణకుమార్ తెలిపారు. పదేళ్లుగా ఏటా పదో తరగతి విద్యార్థుల విజయం కోసం ప్రార్థనలు నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు బ్లెసింగ్ తెలిపారు.

నేటి నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు




వేట్లపాలెంలోని రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం



సోమేశ్వరస్వామి

సామర్లకోట: వేట్లపాలెంలో వేంచేసియున్న పురాతన రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ బాధ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం స్వామి వారి అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో గ్రామంలో రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవం ఆలయానికి చేరిన తరువాత రాత్రి స్వామి వారి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించి కల్యాణం నిర్వహిస్తామన్నారు. 12వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధ్యాత్మిక గురువు రాధా మనోహర్ స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమాలల్లో పాల్గొన్ని కల్యాణ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ నాయకులు పాలచర్ల రాంబాబు, పాలచర్ల సతీష్, మన్యం రామ్‌తేజ, సాయిరామ్ పిలుపు నిచ్చారు.

పూరి జగన్నాథ స్వామి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



మూలపేటలో వేంచేసియున్న బలభద్ర సుభద్ర సమేత జగన్నాథస్వామి



సత్యనారాయణస్వామి



మూలపేటలో జగన్నాథస్వామి, సత్యనారాయణస్వామి ఆలయం

కొత్తపల్లి: మూలపేటలో వేంచేసియున్న జగన్నాథ స్వామి, సత్యన్నారాయణస్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవాల సందర్భంగా సోమవారం అంకురార్పణ, ధ్వజా రోహణం, అగ్ని ప్రతిష్టాపన, సాయంత్రం గరుడ, గజ వాహనంలో గ్రామోత్సవం, ఎదురు సన్నాహం, రాత్రికి స్వామి వారి దివ్య కల్యాణం, మంగళవారం ప్రత్యేక పూజలు, బుధవారం సదస్యం, పొన్నవాహనంపై గ్రామోత్సవం, కోలాటం, 13న రథోత్సవం, 14న చక్రస్నానం (సాగర స్నానం), గ్రామోత్సవం, 15న శ్రీపుష్పయాగంతో కల్యాణ మహోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారిని దర్శించుకుని, పూలమాల వేస్తే యువతీ యువకులకు వెంటనే వివాహం అవుతుందని, దంపతులకు సంతానం కోరిక నెరవేరుతుందని భక్తుల నమ్మకం. వివాహం కాని వారు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తుంటారు. పిల్లలు పుట్టిన అనంతరం భక్తులు స్వామివారికి తులాభారం సమర్పించి తమ మొక్కు తీర్చుకుంటారు.

అపర్ణాదేవికి కుంకుమ పూజలు



తాటిపర్తిలో అపర్ణాదేవి ఆలయంలో కుంకుమ పూజలకు హాజరైన అశేష మహిళా భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కనుల పండువగా కుంకుమ పూజలు నిర్వహించగా వేలాదిగా మహిళలు హాజరై కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. కుంకుమ పూజలకు సుమారు 3 వేల మంది మహిళలు హాజరుకాగా ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక లక్ష కుంకుమార్చనలు, సహస్ర తులసి పూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ నుంచి భారీగా హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి మాట్లాడుతూ ఏటా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా లోక కల్యాణార్థం కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు

మద్యం షాపు ఏర్పాటుపై ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు మల్లవరం సెంటర్లో మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ పలువురు మహిళలు ఆదివారం ఆందోళన నిర్వహించారు. గ్రామంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే వీధిలో మహిళలు, విద్యార్థినులు తిరగలేని పరిస్థితి నెలకొంటుందని, వెంటనే షాపు ఏర్పాటును నిలిపివేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని జన సంచారం లేని ప్రాంతంలో ముఖ్యంగా మహిళలకు ఇబ్బంది లేని ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేసుకోవాలని పలువురు మహిళలు అన్నారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

- విద్యార్థులుగా విడిపోయి... వృద్ధాప్యంలో కలిసి
- 52 ఏళ్ల అనంతరం కలిసిన పూర్వ విద్యార్థులు



52 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పిఠాపురం: బాల్యంలోని మధుర స్మృతులు నెమరు వేసుకునేందుకు మళ్లీ ఒక రోజు వస్తుందని ఆ పెద్దలకు తెలియదు. కాని అరుదైన ఆరోజు కొందరు స్నేహితుల ప్రయత్నం ఫలితంగా సాకారమైంది. కలిసి పదవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు 52 ఏళ్ల తరువాత ఆరు పదుల వయస్సు దాటిన తరువాత మళ్లీ కలుసుకుని సందడి చేశారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వారి జీవితాల్లో కొత్త వెలుగు తీసుకువచ్చింది. అప్పటి వరకు కలిసి చదువుకున్న ఆస్నేహితులంతా ఎవరికి వారు ఊరు దాటి ఎవరి జీవనోపాధికి వారు వెళ్లిపోయారు. ఎవరు ఎక్కడ ఉన్నారో కూడా తెలియని పరిస్థితి. కాని వారిలో కొందరు పూర్వ విద్యార్థులు చేసిన ప్రయత్నం ఎక్కడెక్కడో ఉన్న వారందరినీ ఒకటిగా చేసింది. అలా కలుసుకున్న ఆ పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధుల్లేవు. చిన్న పిల్లలా మారి బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 1973–74లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. 72 మంది అప్పట్లో బాలికలు, బాలురు కలిసి చదువుకోగా (ప్రస్తుతం బాలురు పాఠశాల మాత్రమే) 41 మంది ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అందరి యోగ క్షేమాలు తెలుసుకుని రోజంతా ఆనందోత్సాహాల మధ్య గడిపారు. వీలున్నంతలో ఏటా కలుసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. మా జీవితాల్లో ఈ రోజు మరపురాని సంఘటనగా ఉంటుందని పూర్వ విద్యార్థి హైదరాబాద్‌లో స్థిర పడిన నేషనల్ ప్రాజెక్టు కనస్ట్రక్షన్స్ కార్పొరేషన్ విశ్రాంత ఉద్యోగి గారపాటి ఆదినారాయణ తెలిపారు. ఇక్కడ పదవ తరగతి చదువుకుని ఇప్పటికే 52 ఏళ్లు పూర్తయిందని వారన్నారు. వీరిలో చాలామంది విశ్రాంత ఉద్యోగులు కావడం విశేషం. దంగేటి అప్పన్న, ఒంటెద్దు రామలింగం, కొసిరెడ్డి రామకృష్ణ, పేర్రాజు, గారపాటి నారాయణ చెక్కపల్లి ధర్మరాజు తదితరులు మూడేళ్లుగా వీరందర్నీ సమీకరించి స్కూల్ ఆవరణలో కలుసుకునేలా కృషి చేసారు.

ఉపాధ్యాయ దంపతులకు శిక్ష సాగర్ పురస్కారం

కొత్తపల్లి: మహిళా దానోత్సవం సందర్భంగా శనివారం రాత్రి గుజరాత్ వారి ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ఉపాధ్యాయులతో ఆన్‌లైన్ చర్చ గోష్ఠి నిర్వహించారు.ఈ చర్చ గోష్ఠికి స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న యాళ్ల పద్మజ, మూలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నల్లం అచ్యుత రామచంద్ర మూర్తి ప్రతిభను కనబరచి ఎంపికయ్యారు. శిక్ష సాగర్ ఫౌండేషన్ అందించే రాష్ట్రీయ శిక్షక్ సమ్మాన్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును జాతీయంగా సాంస్కృతిక, సాంఘిక, విద్యాపరంగా విశేష కృషి చేస్తున్న వారిని గుర్తించి అందిస్తారు. ఈ అవార్డు అందుకున్న మూర్తి, పద్మజ దంపతులను ఉపాధ్యాయులు, పలువురు నాయకులు అభినందించారు.

హిందువుల ఉత్సవాలపై పోలీసు జోక్యం సహించం

బోట్‌క్లబ్: కేవలం హిందువుల ఉత్సవాలపైనే పోలీసు ఆంక్షలు, జోక్యం ఎక్కువగా ఉందని విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆరోగ్యభారతి కార్యాలయంలో ఆదివారం వివిధ హిందూ సంఘాలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆర్ రవిశంకర్ పటానాయక్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 4న వీరభద్రస్వామి ఉత్సవంపై ముస్లింలు దాడి చేస్తే వారిని అదుపు చేయడంలో విఫలమైన పోలీసులు హిందువులపై అమానుషంగా లాఠీ చార్జీ చేశారని మండిపడ్డారు.

ఈ విషయంలో హిందువులపై కేసులు బనాయించినందుకు నిరశనగా సోమవారం ఉదయం స్థానిక బాలాజీచెరువు సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మాలకొండయ్య, అప్పాజీ, పెండెం శ్రీదేవి, గూటూరు పద్మ, తుమ్మల పద్మ పాల్గొన్నారు.



రాయచోటి ఘటనను ఖండిస్తున్న హిందూ సంఘ నాయకులు

డైమండ్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

కరప: పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసి 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 26, 27 తేదీల్లో డైమండ్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పూర్వవిద్యార్థి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా చంటిబాబు తెలిపారు. పెద్దాపురప్పాడు హైస్కూల్లో ఆదివారం చంటిబాబు అధ్యక్షతన పూర్వవిద్యార్థులు సమావేశమై పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహణకు ఫైనాన్స్, సావనీర్, నిర్వహణ వంటి వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదివినవారు ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించిన వారు, వ్యవసాయదారులుగా పేరు ప్రఖ్యాతులు గడించిన వారున్నారు. దేశ, విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరినీ ఆహ్వానించేందుకు తీర్మానించారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు పూర్వవిద్యార్థులు, ఆహ్వాన కమిటీ సభ్యులు చిక్కం రామచంద్రరావు, బిరుదా శ్రీనివాస అప్పారావు, ఎర్రంశెట్టి కొండ, నల్లా సత్యనారాయణ, సలాది మూర్తి, తోట మూర్తి, అయిరెడ్డి సత్యనారాయణ, గొల్లపల్లి లక్ష్మణరావు, దేవు సదానందమూర్తి, తాడి మాచారెడ్డి, ఎర్రంశెట్టి కొండ తెలిపారు.